# ముఖసాలు

డా॥ వి.ఆర్. రాసాని



''ఏమయ్యా! పొద్దన్నే వూరికే కూసుంటే అవునా! యేదోవొగిటి చేసుకోకపోతే యట్టా?''

చుట్టింట్లో ఎండు చేపలావున్న చంక బిడ్డకి పాలిస్తూ అంది ఆదిలచ్చిమి. ఆమె వంటి పైనా అంత కండలేదు. చింపిరిజుట్టుతో సన్నగా, చర్మం కప్పుకున్న ఎముకలతో పొలాల్లో తిరుగాడే గొల్లభామలా వుంది. ఆమె కట్టుకున్న చీరా అక్కడక్కడా మాసికలతో కనిపిస్తోంది.

''చేసేదానికి యేం పండ్లుండాయే. భూములున్న మారాజులే కరువుకు పొట్ట చేతబట్టుకోనుండారు. యింక మనట్లా వోళ్ళు యేంజేసేదీ?''

వీధిలో గడప పక్కన, ఈగల్ని తన చీమిడి ముక్కుతో ఆకర్షించి ఆదరిస్తూ... గుజ్జు రూపం దాల్చిన దరిద్ర దేవతలా

కూర్చోనున్న అయిదేండ్ల చిన్నమ్మి వైపు చూస్తూ నిర్వేదంగా అన్నాడు ఇర్లోడు. ఆ బిడ్డ శరీరం పైన ఏ ఆచ్ఛాదనా లేదు. సరైన తైల సంస్కారం లేక రాగిరంగులోకి మారిపోయివున్న జుట్టు గచ్చపాదలా వుంది.

''యేందయ్యా, నీకు సెప్తావుంటే మొఖుసకెక్కలా. యింట్లో నూకలు అయిపోయి పది దినాలయింది. పిల్లోల్లు పల్లెలమిందబడి అడక్కొచ్చుకోని తింటా వుండారు. ఏం బతుకో ముండ బతుకు.'' ముక్కు చీదుకుని పైటకు తుడుచుకుంటూ చెప్పింది ఆదిలచ్చిమి. ఆ మాటలు వినేసరికి తన మనసు విలవిలలాడిపోయి విప్పిపారేసిన పొట్లం కాగితంలా తయారయింది.

ఏదీ పట్టనట్లు, గుడిసె పక్కనున్న రాతి తిన్నెపైన కూర్చొని ఢక్కీ వాయిస్తూ ''నెరా నెరా నెరబడండి జెరా జెరా నిలుపుబండి'' అంటూ జానపద గీతం పాడుకుంటున్నాడు పన్నెండేండ్ల ముసిలిగోడు.

వీధిలో కొందరు పిల్లలు, చింపిరి జట్టుతో చిరిగిన బట్టల్తో మట్టిలోనే కూర్చొని ఆడుకుంటున్నారు.

రెండు వీధి కుక్కలు ఒక పందిగున్నను తరుముతుంటే, అది ప్రాణభయంతో ఘీ పెడుతూ పల్లకవతలకి పరిగెత్తుతోంది. ఆ దృశ్యం చూసి కొందరు 'ఛ్చాయ్. ఛ్చాయ్' అంటూ కుక్కల్ని అదిలిస్తున్నారు.

''యేమ్మామా, పొద్దన్నే తీరుబడిగా కూసోనుండావు?'' గుడిసె ముందరికి వస్తూ పలకరించాడు వెంకటస్వామి.

''కూసోక చేసేదానికేముండాదిరా'' గొణిగినట్టున్నాడు ఇర్లోడు.

''యేమ్మామా! మనం జూలెత్తుకొని అట్ల మార్లోకన్నా పోతే తిండి గింజలేమైనా వస్తాయేమో గదా'' అన్నాడు వెంకటస్వామి.

''కరువుకి, రైతులే కష్టాల్లో వుండారు. మనకేం పెడతారు.''

''అట్టనొద్దులే మామా. మనకు చెయ్యి సాచే మారాజులుండనే వుంటారు.''

''మనం బొయ్యి యిండ్ల ముందర నిలబడితే, 'వొగడొగడు ఎద్దులు మాదిరుండారు. అడుక్కుంటే దానికొచ్చిండారు సూడో' అంటా గెడ్డి పెడతారు.'' తన అనుమానం వ్యక్తం చేశాడు ఇర్లోడు.

''యిట్లే పోతే అంటారు. మనం యేజేసి కాలేసుకోని చిందాడితే సరిపాయ'' కళ్ళు పెద్దవి చేసి ఉపాయం చెప్పాడు వెంకటస్వామి.

''నాకు చిందెయ్యడం రాదే''

''నీకు వచ్చులే మామా ఊరికే అట్టంటావుండావు గానీ.. పోనీలే డముకు వాయించు మిగిలింది మేం జూసుకుంటాం.

''నువ్వేన్నన్నా చెప్పురా యెంగటా! ఆ మడిసికి దున్నపోతు మింద వాన కురిసినట్టే.'' అంతవరకూ మౌనంగా వున్న ఆదిలచ్చిమి అందుకుంది.

ఆ మాటలో సరేననక తప్పలేదు ఇర్లోనికి.

''మనమేనా యింకా ఎవురన్నా వస్తారా?'' అడిగాడు.

''నాగాడు, నారిగోడు వస్తార్లే.'' అంటూ వెంకటస్వామి రెండు గుడిసెల కవతల వున్న తన గుడిసెలోకి వెళ్ళి అంత అర్దాలం తెచ్చి ''ముఖానికి రంగేసుకోమామా'' అని ఒక డబ్బాయిచ్చి తిరిగి వెళ్ళిపోయాడు.

''అప్పుడెప్పుడో వయసులో వున్నప్పుడు, గంగజాతర కేసుకున్నయేసిం. మళ్ళా యిన్ని దినాలకు అవసరమైంది'' అనుకుని డబ్బా మూత తీసి, అందులోనుంచి అర్దాలం పౌడరును కాస్త ఎడమ చేతిలోకి వంచుకుని, డబ్బా మూత పట్టుకుని వచ్చి మళ్ళీ అదేస్థానంలో కూర్చున్నాడు.

కొబ్బరినూనె అర్దాలం పొడిని బాగా కలిపినాడు. అద్దం ముక్కను ముందుర పెట్టుకుని దాన్ని ముఖానికి పూసుకోసాగాడు.

లోపలికి పీక్కుపోయిన కండ్లు, బక్కచిక్కిన శరీరం, కట్టెపుల్లలని తలపింపజేస్తున్న కాల్లూ చేతులూ.. అద్దం ముక్కలో తన ముఖాన్ని చూసుకుని నిర్లిప్తంగా ఒక్క నిట్టూర్పు విడిచాడు ఇర్లోడు.,

నల్లటి అతని ముఖంలో ఎర్రటి ఉర్దాలం ఉదయపుటెండకు మెరుస్తోంది. అతని తలలో అక్కడక్కడా నెరిసిన వెంట్రుకలు కొట్టొచ్చినట్టు కనిపిస్తూ తమ అస్తిత్వాన్ని తెలుపుకుంటున్నాయి.


''యేం సినాయనా! అయిందా?'' అన్న మాటతో ఏదో ఆలోచిస్తున్న ఇర్లోడు ఇహంలో కొచ్చి తలపైకెత్తాడు.

ఎదురుగా చెంచిత వేషంలో నారిగోడు.

అతను ఎర్రటి జాకెట్టు తొడిగి, ఎర్రటి చీరలో శరీరాన్ని చుట్టుకున్నాడు.

ముఖానికి ఎరుపురంగు, మెడలో పూసలదండ, చెవిలో కుండలాలు. సవరం విగ్గుతో జడవేసి, కొప్పు చుట్టి, ఆ కొప్పునిండా ఎర్రటి కాగితాల పూలు తురుముకున్నాడు. చూడడానికి, మనిషి ఆడవారిలా మెలికలు తిరిగిపోతూ కనిపిస్తున్నాడు.

''నా యేసికం గూడా అయిపోయిందబ్బా'' అని





## లోపెజ్ ఆకర్షణ

ఎదలు కనిపించేలా ఓ పదిలక్షల రూపాయలు పెట్టి కొన్న జెన్నిఫర్ లోపెజ్‌ను చాలామంది హాలీవుడ్ అభిమానులు ఆశ్చర్య పోయేలా చూశారు. కానీ తుస్సాడ్ మ్యూజియంలో వున్న బొమ్మను చూస్తే మరింత ఆశ్చర్యమేస్తుంది. ఏడాది కిందట జెన్నిఫర్ లోపెజ్‌ను మేడమ్ తుస్సాడ్ మ్యూజియంలో మైనపు బొమ్మగా చేరిన ఆమె చాలామందిని టెంప్ట్‌కు గురిచేస్తోంది. అచ్చు లోపెజే అక్కడ నిల్చున్నట్టు కనిపిస్తూండటంతో ఒక్కసారైనా అలా మీద చెయ్యేద్దామన్నంత ఆశ కలుగుతోందిట. అంతెందుకూ మ్యూజియంలో పనిచేసే కళాకారుడే చూడండి మనసు నిలవ లేక మీద చెయ్యేశాడు. ఇంతకీ లోపెజ్ పాటలు, డాన్సులే కాదు, బొమ్మకూడా యువకులను విపరీతంగా ఆకర్షణకు గురిచేస్తోంది!

యిర్లోడు వేషం వేయడం పూర్తిచేసి వచి, అర్దాలం డబ్బాను యింట్లో పెట్టివచ్చాడు. దండెంపైనున్న ఎఱ్ఱటి తుండుగుడ్డను తీసుకుని తలకు చుట్టుకున్నాడు. ఆ తర్వాత పొయ్యిలోనుంచి ఒక ఒక బొగ్గుముక్కను వెదికి తెచ్చుకొని ,గుడిసెముందరున్న ఒకరాతిపైన రెండు నీళ్ళచెక్కలు చల్లి బొగ్గును సాదాడు. సాదగా వచ్చిన నల్లటి బొగ్గుద్రవంలో వేలిని అద్ది కనురెప్పల దిద్దుకొని మీసాలకు పూసుకున్నాడు.

''యేమయ్యా సామీ, యింకా కాలేదా'' అంటూ మెడకు డోలులాంటి మట్టి డుముకును తగిలించుకొని ఎగేసుకొంటూ, చేతిలో రెండు బిల్లల్ని పట్టుకొని వచ్చాడు నాగడు. అతను బులుగురంగు చొక్కా వేసుకున్నాడు. ముఖానికి సున్నం పూసుకుని, అక్కడక్కడా నల్లగా బొగ్గుచెక్కల్ని పెట్టుకొని, బొగ్గుతోనే పెద్దమీసాలు దిద్దుకొని వచ్చాడు. గంగ జాతరలో దయ్యం వేషంలా వుంది అతని ముఖం.

''అయిపోయిందబ్బా'' అంటూ చేతిలవున్న అద్దంముక్కను పక్కనపెట్టి పైకిలేచాడు ఇర్లోడు.

ఇదంతా చూస్తున్న ముసిలిగోడు ఢక్కీ కొట్టడం ఆపి ''నాయనా! నేను వస్తా'' అన్నాడు.

'' ఆ... రారా అల్లుడా సంచన్నా పట్టుకోవచ్చు'' ఒక సంచీ చేత బట్టుకొని అప్పుడే అక్కడికి వచ్చిన వెంకటస్వామి అన్నాడు.

అతనూ వేషంలో వున్నాడు. అతనిది నరసింహస్వామి వేషం. మెడలో నీలిరంగు, ఎఱ్రటి నిలువు నామం, సన్నటి మీసాలు, చెవులో కుండలాలు, మెడలో పెద్దపెద్ద పూసలదండలు. తలకు ఎఱ్రటి రిబ్బనుతో వాసెన కట్టు కట్టుకొని దానికి పొడూటి పక్షి ఈకను నిలువుగా చెక్కాడు. రిబ్బనుకు వేసి ముడిచుంగులు కుడిచెవి మీదుగా దవడవరకూ వ్రేలాడుతున్నాయి. మొలకు పచ్చటిచీర పొడవుగా గోచీ పోసి కట్టాడు. చేతిలో ఒక అంబు, సంకన ఒక విల్లు, కాళ్ళకు గజ్జలు.

ఇర్లోడు యింట్లోకి వెళ్ళి ఒక చేతి సంచిని చేతబట్టుకున్నాడు. అక్కడే ఓ మూలన గోడ కొమ్మకు తగలించుకున్న డుముకుని, జల్లల్తో సహా ఎత్తుకొని వున్న టైరు చెప్పుల్ని తీసి కాళ్ళకు తొడుక్కుని ఇంక పదండబ్బా' అన్నాడు.

అందరూ ఆ యానాది గూడెం దాటి కల్లూరివైపుకు నడవసాగినారు.

వాళ్లు నడుస్తుంటే వాళ్ళ కాళ్ళకున్న గజ్జలు ఘల్లుఘల్లున శబ్దం చేస్తూవున్నాయి. డొంక దారిలో వాళ్ళ కాళ్ళకింద ఇసుక దువ్వదువ్వ పోతూ అయిపోతూ లోతుగా పాదముద్రలు ఏర్పడుతున్నాయి.

అక్కడ ఒకచోట రాళ్ళకుప్పల్లో నుంచి ఓ పాము మెరుపులా మెరిసి సరసరా కదిలి ప్రక్కనున్న తీంద్రపొదలోకి మాయమైపోయింది.

అది గమనించిన ముసిలిగోడు ''అద్దోపాము'' అన్నాడు ఉత్సాహంగా

''పోతే పోనీలే పద'' అన్నాడు నాగడు.

మిగిలిన వాళ్ళూ దాన్ని గమనించినా ఏమీ ఎరగనట్లే మౌనంగా నడుస్తున్నారు. మామూలుగా అయితే పాము కనిపిస్తే చాలు ఇర్లోళ్ళకు పండగే. ఎట్లోకట్ల దాన్ని పట్టి చర్మం తీసి అమ్ముకునిందాకా నిద్రపోరు.

''ఏమిరా నాగా! ఇర్లోళ్ళ బతుకులు యిట్టయిపాయ. పాముని జూసి కూడా గొమ్మున పోయే కాలం దాపరించ'' వాళ్ళ మౌనాన్ని భంగపరుస్తూ అన్నాడు ఇర్లోడు.

''అవునన్నా. పాములబట్టే మన కులవుర్తే మనం మర్చిపోతాండాం'' అన్నాడు నాగడు.

''నేను వయసులో వున్నప్పుడు ఇంట్లో రెండు మూడు బుట్టల్లో పాములుంటావుండె. ఆ పాములకు కోడిగుడ్లు, బాతుగుడ్లు యేస్తావుంటిమి. అప్పుడప్పుడూ కప్పలు, సిన్న సిన్న ఎలుకల్ని పట్టి యేసి మేపతావుంటిమి.'' అన్నాడు గతాన్ని తలుచుకుంటూ ఇర్లోడు.

''అవును బాగా కువకువలాడే నాగుబాముకు నోరు కొంచెం వదిలేసి దవడల్ని సన్నటి నైలాను వైరుతో కుట్టేసి, బుట్టలో పెట్టి ఆడిపాస్తవుంటిమి'' అన్నాడు నారిగోడు.

''అవునవును.. అట్ల కుట్టేయబట్టే అవి నీరసించి పోయి, తిండిలేక నీళ్ళు పెట్టినా పీల్చేస్తావుండె. పాలుపెట్నా పీల్చేస్తావుం డె. వొగోసారి సచ్చిపోతావుండె.''

వ్యంగ్యంగా అన్నాడు నవ్వించే ధోరణిలో నాగడు.

'' ఆ కాలం మల్లా వస్తుందా?'' నారిగోడన్నాడు నిట్టూరుస్తూ


''పల్లెల్లో పామును ఆడిస్తావుంటే పిల్ల జల్లా మూగిపోతావుండ్రి... పైగా ఇంటి ముంద రకొచ్చిన ఇర్లోన్ని రైతులు ఏనాడూ వట్టిచేత్తో పంపిందిలే'' అన్నాడు వెంకటస్వామి.

''అప్పటి కాలంలో ఆమీని సేద్యాలుండె. బీటి చేలల్లోను, మడిగె నాలల్లోను.. ఎలికబొక్కల్ని తవ్వ

కంటే ఎలికలు కూడబెట్టిన శనక్కాయలు, వడ్ల గింజలు తోడుకున్నా కొన్నిదినాలు గడస్తావుండె. ఆ ఎలికల్ని పట్టుకోని పోయి మసాలాపెట్టి వండుకుంటే నోటి తీపి తీరిపోతావుండె. అన్నాడు ఇర్లోడు.
''యిప్పుడు ఆ సేద్యాలూలేవు... ఆ ఎలికలు లేవు'' అన్నాడు నారిగోడు.
'' ఇండ్ల ముందరికిపోతే అంతపెట్టే రైతే లేడులే'' ఎత్తిపొడుపుగా అన్నాడు నాగడు. వాళ్ళు అలా మాట్లాడుకుంటూ కల్లూరు చేరుకున్నారు.
అది కల్లూరుపేట. జిల్లాలోనే అదీ ఒక ముఖ్య వ్యాపార కేంద్రమే.
ప్రతి ఇల్లూ ఒక అంగడే.
గుడ్డలంగళ్ళు, బియ్యపుకొట్లు, చిల్లరంగళ్ళు, హోటళ్ళు, అక్కడక్కడా కసాయికొట్టు... ఎప్పుడూ బిజీగా వుండే చదురంరోడ్డు. కడాన మజీదు. దాని పక్కన ఓ కల్లంగడి...
వాళ్ళు ముందు అక్కడికి వెళ్ళి కల్లు తాగివచ్చారు.
తర్వాత ఓ అంగడి ముందర నిలబడి చిందు ప్రారంభించారు.
ఇర్లోడు, నాగడు 'డుబ్బాచుకో, డుబ్బాచుకో' అంటూ అదేపనిగా డముకులు వాయించసాగారు.
''వద్దురా సిద్దులయ్య యిద్దరు పెళ్ళాలూ
దాన్ని చూస్తే దీనిక్కోపం, దీన్ని జూస్తే దానిక్కోపం
వద్దురా సిద్దులయ్య యిద్దరు పెళ్ళాలు''
అంటూ చేతిలో విల్లంబును గాలిలో ఆడిస్తూ కాస్తా నడుం వంచాడు డముకులు శబ్దానికనుగుణంగా, చిందు తొక్కుతూ అడుగులు వేస్తున్నాడు వెంకటస్వామి. వస్తూ వస్తూ దారిలో విరుచుకున్న కానగ కొమ్మను, ఆకుల్తో సహా చేతిలో పట్టుకుని, అడుగులేస్తూ, మరో చేతిని వయ్యారంగా తిప్పుతూ నర్తిస్తున్నాడు నారిగోడు.
వాళ్ళ ఆటాపాటా ఉత్సాహంగా సాగుతున్నాయి. చుట్టుపక్కల అంగళ్ళలోని జనం గుమిగూడిపోయి వాళ్ళేసే చిందు చూస్తున్నారు. ఇర్లోడు, నాగడు డమకుల శబ్దంతో ఆ ప్రాంతం గుమ్మెత్తిపోతోంది.

**''వచ్చే వారమే దీపావళి. కట్టుకున్న బాశాలికి వుండేది రెండే రెండు చీరలు. అవయినా గట్టిగా లేవు. చిరిగిపోయివున్నాయి. ఈ సారన్నా దానికొగ కొత్త చీర కొనక్కుంటే నా మగతనం ఎందుకు. కాల్చినా ఆ చిన్నమ్మకి అసలు గుడ్డలే లేవు. దానికి ఒక గౌను కొనాల. సంకబిడ్డె సంగతి సరేసరి. దానికి పాలేగాదు, సరయిన తిండిలేక ఎండిపోయుండాది.**

రోడ్డునపోయే వాళ్ళు కూడా ఆగి చూసి వెళుతున్నారు.
డముకును వాయిస్తున్నాడన్న మాటేగానీ ఇర్లోడికి మనసు మనసులో లేదు.
''వచ్చే వారమే దీపావళి. కట్టుకున్న బాశాలికి వుండేది రెండే రెండు చీరలు. అవయినా గట్టిగా లేవు. చిరిగిపోయివున్నాయి. ఈ సారన్నా దానికొగ కొత్తచీర కొనక్కుంటే నా మగతనం ఎందుకు. కాల్చినా ఆ చిన్నమ్మకి అసలు గుడ్డలే లేవు. దానికి ఒక గౌను కొనాల. సంకబిడ్డె సంగతి సరేసరి. దానికి పాలేగాదు, సరయిన తిండిలేక ఎండిపోయుండాది. పండగ దినానికయినా దానికి గలాసుడు పాలు తీసియ్యాల.'' అనుకుంటూ ముసిలిగోడివైపు చూశాడు.
బాగా మాసిపోయి నల్లగా కనిపిస్తున్న కాకినిక్కరు గుండీలు లేని చొక్కాలలో సగం రొమ్ము, సగం పొట్టా కనిపిస్తుంటే... ధాన్యం కోసం తెచ్చిన సంచిని నేలపైన పెట్టుకొని డముకుల శబ్దంతో శ్రుతి కలుపుతూ ఢక్కీ వాయిస్తున్నాడు ముసిలిగోడు.
''బడికి పోయి సదువుకోవాల్సిన బిడ్డె'' మాయెనకింటీ అడుక్కోడానికి వొచ్చిండాడు. కనీసం ఈ మొగమొలకనన్నా సదివించుకుందామంటే కాలా. మనసులోనే మధనపడసాగాడు ఇర్లోడు.
ఆ అంగడి దగ్గర మొండికేసుకుని అతనిదగ్గర రెండురూపాయలు రాబట్టుకోవడానికి తెగ ఆయాసపడిపోవాల్సి వచ్చింది వాళ్ళకి.
'' ఆ యింక ఆ పక్కంగడికి పదండి మామా'' అన్న వెంకటస్వామి మాటతో అందరితో బాటు మరో అంగడి ముందుకు నడిచాడు ఇర్లోడు.
''చెట్టు లెక్కగలవా నరహరి పుట్టలెక్కగలవా
పుట్టలో వుండే పట్టుతేనె చెయ్ పెట్టి తియ్యగలవా
పుట్టలెక్కగలవా నరహరి – పుట్టకూడు చూడగలవా



పుట్టకుంటికి నీళ్ళు పెట్టి ఇసుళ్ళను తోలి పట్ట
గలవా''

వానాకాలంలో పుట్టల్లో లేచిన ఈసుళ్ళను, పట్టుకొని వేయించి అమ్ముకోవడం కూడా వాళ్ళ కుల వృత్తిలో ఒక భాగమే. ఆ వృత్తాంతాన్ని పాటలో వర్ణిస్తూ, చెంచు చెంచిత సంవాదంగా వాళ్ళ చిందు సాగుతోంది.

మహావిష్ణువు నరసింహస్వామి అవతారంలో ప్రహ్లాదుని కాపాడి చెంచితగా పుట్టిన మహాలక్ష్మిని వివాహమాడడానికి వచ్చి ఆమె ప్రేమలో పడే ఘట్టాన్ని వెంకటస్వామి చిందు తొక్కుతూనే ఆలపిస్తున్నాడు. అక్కడ చేరిన ప్రజలు వాళ్ళ చిందుని ఆనందంగా తిలకిస్తున్నారు.

కానీ ఇర్లోడి మనసుని పట్టుకున్న ఆలోచనల్లు మాత్రం ఎంతకీ వదలడం లేదు.

ఆతని ఆలోచనలకు ముగిపుంపు లేనట్టే, వాళ్ళ ఆటపాటకు ముగింపు రాలేదు.

''పుట్టలోకిపాము పాయరా సిన్నాయనా డుబ్బూ
చుకో డుబ్బూచుకో
తోకబట్టీ లాగరా సిన్నోడా డుబ్బూచుకో డుబ్బూ
చుకో

యానాదులు పాములు పట్టే వృత్తాంతాన్ని వెంకటస్వామి, నాగడు పెద్ద గొంతుతో ఒకిరికిమించి ఒకరు పోటీపడుతూ పాడుతున్నారు.

ఇర్లోడు డముకును వాయిస్తూనే వున్నాడు. మునిగోడు ఢక్కీతో శ్రుతి కలుపుతూనే వున్నాడు. ఇర్లోడు పాముల్ని పట్టడంలో మహా నేర్పరి. అయినా పామును బట్టి చాలా ఏండ్లే అయింది. మళ్ళీ పామును బట్టే అవకాశం జీవితంలో ఇక రాదేమోననుకున్నడు. ఈ వృత్తి తనతోనే కడేమోనని కూడా అనుకున్నాడు. ఇక అప్పటినుంచీ తన చిన్నప్పటి జ్ఞాపకాలు, పాములతో తన అనుభవాలు నెమరువేసుకోవడమే మిగిలింది. ఎవర్ని చూసినా కాళ్ళు చేతులు వున్న పాముల్లా కనిపించే వాళ్ళు కొందరి ముఖాలు చూస్తే ఆ పాములు గుర్తుకు వచ్చేవి. పని చేయని సోమరిగాళ్ళను చూస్తే పూడుబాము దాసరిపాము గుర్తుకొచ్చేది. తెల్లబట్టలేసుకొని తిరిగే నాయకుల్ని చూస్తే కొండచిలువలు గుర్తుకొచ్చేవి. ఇలా మనుషులు ముఖమూ, ముక్కుచెవులున్న రకరకాల పాముల్లా కనిపించే వారు. తన జీవితంలో చూసిన ప్రతి పాముకు మనుషుల ముఖాలతో పోల్చుకుని చూసుకోవడంతోనే సంతృప్తి చెందేవాడు. అయితే అనుకోకుండా పదిరోజుల క్రితం ఓ పామును బట్టే అవకాశం దొరికింది అతనికి.

ఆ రోజు ఇంట్లో పరిస్థితి మరీ అధ్వాన్నంగా వుంది. రోజూ పిల్లలు, ఇంట్లో ఆడది ఊరిమిందబడి అడుక్కొచ్చిన దాంతో ఇంటిల్లపాదీ ఆకలి తీర్చుకునేది. కానీ ఆ రోజు ఏ తల్లీ పిడచన్నం పెట్టిన పాపాన పోలేదు. ఏం చేయాలో ఇర్లోడికి పాలుపోలేదు. ఏ పనీపాటా లేకుండా గుడిసె ముందర కూర్చోనున్నాడు.

''మయ్యా! అట్లబొయ్యి పిల్లోళ్ళకన్నా అంత పెట్టేటిగాసూడు''

ఆదిలచ్చిమి గోకడం ప్రారంభించింది.

సరిగ్గా అప్పుడొచ్చాడు రెడ్డివారి పల్లె గంగిరెడ్డి.

'' ఆయన పెద్దరైతు. ఇక్కడికెందుకొస్తున్నట్టు. ఏదో బేరం తగిలేటట్టుగానే వుండాది '' అనుకున్నాడు.

''మీ ఇర్లోడా! పొద్దన్నే గొమ్మున కూచ్చోనుండావు. '' అతన్ని సమీపించి పలకరించాడు గంగిరెడ్డి.

''భూమా, పుట్రా ఏం పనుండాదబ్బా'' నిర్లిప్తంగా అన్నాడు.

''పామునేమన్నా పట్టగలవా?'' అడిగాడు.

'' ఈయ్యాది మిట్టలో యిందురుండంగా నన్నే వచ్చి అడగతా వుండావే.. యేమన్నా'' నవ్వుతూ అన్నాడు ఇర్లోడు.

''మడిసేద్యాలు బాగా జరిగే కాలంలో, మా గెనాల్లో ఎలుకల్ని, పాముల్ని నువ్వేగదా పడతావుండింది. అందుకేనే నిన్నడుగతావుండా.''

''అయినా మేం పట్టేపాములు యింకా యాడుండాయన్నా?''

''మా కొట్టంలో పట్టుపురుగులు మేపతావుండాము గదా. వొగ నాగబాము పై తట్టల్లో పురుగుల్ని మింగేసి పోతావుండాదిరా.''

''పట్టుపురుగులకు పామెట్లొస్తాదన్నా. యిచ్చి త్రంగా వుండాదే ''

''చాకీ (గుడ్లనుంచి బయటికి రాగానే మొట్టమొదట పురుగులకి ఆకు తరగి వేయడం) కట్టింతర్వాత, అవి నాలుగు జ్వారాలు పూర్తి చేసుకుంటా నాలుగో జ్వరం అయిపోయింతర్వాత తెల్లటి మిఠాయి వర్ణానికొచ్చి గమగమ వాసనొస్తాయి. ఆ వాసనకి పాములొస్తాయి. ఇంక నాలుగు దినాలట్టుంటే.. చంద్రికల్లో యేసేస్తాం. గూళ్ళు కట్టేస్తాయి.''

''సరే నువ్వు పదన్నా. నేనొస్తా.'' అన్నాడు ఇర్లోడు.

''సరే బిరీనొచ్చెయ్.'' అంటూ అక్కడినుంచీ పోయాడు గంగిరెడ్డి.

సలాకీని, మచ్చుకత్తిని, ఒక చివర 'వి' ఆకారంతో బారెడు పొడవున్న 'తమరకట్టె'ను చేతబట్టుకున్నాడు. చెక్కస్టాండులోని ఒక డబ్బీలోవున్న పామేరు ముక్కనొకదాన్ని తీసుకుని బొడ్లో దోపుకొని 'రారా' అంటూ కొడుకుని వెంట బెట్టుకుని రెడ్డివారిపల్లెకు బయలుదేరాడు.

ఇర్లోడు పోయేటప్పటికి గంగిరెడ్డి యింటిదగ్గరే వున్నాడు. ఇద్దరూ కలిసి ఊరి చివర పట్టుపురుగులున్న కొట్టం దగ్గరికి చేరుకున్నారు.

కొట్టంలో సగభాగం చెక్కస్టాండ్లు, వాటినిండా వెడల్పాటి తట్టలు వరుసగా పేర్చబడి వున్నాయి .అప్పుడే ఆకు కత్తిరించి వేసినట్టుంది. ఆకును మేస్తూ తట్లనిండా పట్టుపురుగులే. మరోవైపున గోడకు ఆనించివున్న మల్బరీ ఆకులు, వాటిపక్కనే ఆకు కత్తిరించే కత్తి, చెక్కతుండు... వాటి కవతల పురుగులు గూళ్ళు కట్టడానికి వేసివున్న చంద్రికలు.. కుప్పగా పేర్చబడి వున్నాయి.

పట్టుపురుగులు గురించి వినడమే గానీ దగ్గరగా చూసి ఎరగని ఇర్లోడు ఆ పరిసరాల్ని ఒక్కక్షణం విచిత్రంగా చూశాడు.

ఇర్లోడు చూరుకిందనుంచే పామొచ్చేట్టుందబ్బా



## నాకెందుకూ బాధ

'అసలు నామీద వచ్చే పుకార్లకు అర్ధమే లేకుండాపోతోంది. ఐశ్వర్య, అభిషేక్ దగ్గరయ్యేకొద్దీ నేను బాధపడుతున్నానని ముంబయ్‌లో పుకారు వచ్చింది. అది ఇటీవలే నాకు తెలిసింది. అయినా వాళ్లిద్దరూ దగ్గరైతే నాకెందుకూ బాధ. నాక్కూడా అభిషేక్ మంచి మిత్రుడే. ఇటీవల జరిగిన ఓ ఫంక్షన్‌లో నన్ను కౌగిలించుకుని ముద్దు కూడా పెట్టుకున్నాడు. మా యిద్దరి మధ్యా మంచి అండర్‌స్టాండింగ్ వుంది. అయితే ఈ ప్రేమ గొడవ ఏంటో నాకర్ధం కాలేదు. ఐశ్వర్య-అభిషేక్‌లు చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతున్నంత మాత్రాన నేను ఈర్ష్య పడను. ఎవరి ఎఫైర్ వారికుంటుంది. అలాగని ఒకర్ని చూసుకుని ఒకరు బాధపడతారు. పుకార్లకూ ఓ హద్దుండాలి.. డామిట్!' అంటూ తెగ చిరాగ్గా మాట్లాడుతోంది ఈ మధ్య ప్రియాంక చోప్రా. అండర్‌స్టాండింగ్ వున్నాక ఎఫైర్ ఎందుకుండదూ అంటున్నారు ఇంకొందరు!

కొట్టాన్ని పరిశీలిస్తూ అన్నాడు.

ఆ కొట్టం ఊరికి చివర వుండడంతో ఆ ప్రదేశంలో ఎక్కడైనా పుట్టలు, బొక్కలు వున్నాయేమోనని వెలుపలికి వచ్చి చూశాడు. ఆ ప్రాంతంలో ఎక్కడా ఆ చిహ్నాలేవీ లేవు. ఆ కొట్టం వెనకభాగమంతా బీడునేల. ఆ నేలకవతల కొంతదూరంలో ఏవో కొన్ని కంపచెట్లు, ఆన చెట్ల కవతలున్న తుప్పచెట్ల మధ్యన ఏదో శాపవశాత్తు ఏ గంధర్వుడో పాషాణంగా మారిపోయి అక్కడ పడివున్నట్లు ఒంటరిగా కనిపిస్తున్న నిలువెత్తు గుండు. దాన్ని చూస్తూనే హమ్మయ్య అనుకుంటూ గాలి పీల్చుకుని ''పామెక్కడా పోలేదన్నా. ఆ గుండిదెగ్గిరే వుంటుంది'' అన్నాడు యిర్లోడు.

''పాము అక్కడే వుంటుందని యెట్ల చెప్పగలవు?'' అనుమానం వ్యక్తం చేశాడు గంగిరెడ్డి.

''అంతమాత్రం తెలుసుకోకపోతే నేనీర్లోన్నెట్టయితా'' అంటూ ఆ ప్రాంతంలో నేలను పరిశీలిస్త గుండి వైపు నడవసాగాడు ఇర్లోడు. కొంతదూరం వెళ్ళాక ఒకచోట దుమ్ములో పాము ప్రాకిన గుర్తుల్ని సులభంగానే గుర్తించగలిగాడు.

''అక్కడున్నవన్నీ చిన్న కంపచెట్లు, తుప్పచెట్లు, చిన్న చిన్న రాళ్ళు. అట్టాంటి వాటిల్లో పాముండే యిదే లేదు.అనుకుంటూ,అక్కడికి మరికొంత దూరంలో వున్న గుంటివైపు చూశాడు! అది మొదలు సన్నగా వుండి పైన వెడల్పుగా... ఒక పెద్దశంఖాన్ని తల్లకిందులుగా నిలబెట్టినట్టుంది. ఇర్లోడు అక్కడికి వెళ్ళి గుంటి చుట్టూచూసుకుంటూ.. ఒకచోట ఆగిపోయాడు. అక్కడ... ఎలుకలు తోడిన మట్టికుప్ప చిన్న కొండలా కనిపించింది. దాని దగ్గరకు వెళ్ళి తొంగి చూశాడు. ఆ మట్టికుప్పపైనా పాము ప్రాకిన చిహ్నాలు కనిపించాయి.

ముసిలిగోడితో బాటు గంగిరెడ్డీ అతన్ని ఆసక్తిగా చూడసాగారు.

''అన్నా! పాము యిక్కడే వుండాది. నీ పట్టుపురుగులు సాలక యిక్కడుండే ఎలికల్ని గూడా మింగేసినట్టుండాది అంటూ నడుం మీద చేతులు పెట్టుకుని నిటారుగా నిలబడి ''పట్టేస్తా గాని ఏమిస్తావో చెప్పు'' బేరమాడాడు ఇర్లోడు.

''పదయిదిస్తాలే పట్టేయ్'' అన్నాడు గంగిరెడ్డి.

''అంత కానా కష్టంగా సెప్తే యెట్ల సామే. మీరి య్యాల మేం తినాల'' చేతులు గాల్లో తిప్పుతూ నసిగాడు ఇర్లోడు.

''యింకెంతియ్యమంటావురా?''

'' ఎంతో నువ్వే సెప్పన్నా''

''అదీ ఇదీ వద్దుగానీ ఇరవై అయిదిస్తాలే. యింక గోజాడొద్దు. పో''

''సారాయికన్నా యింకో అయిదెగేసియ్యి సామే'' ఆర్థించాడు ఇర్లోడు.

''సరే ముందు పామును బట్టు'' అన్నాడు గంగిరెడ్డి.

ఆ మాటతో బొడ్లో దోపుకున్న పామేరు ముక్కను తీసి నోట్లో వేసుకుని నములుతూ, గోచీ ఎగబెక్కి, యుద్ధానికి సిద్ధమయ్యే సిపాయిలా సలకా తీసుకుని రంగంలోకి దిగాడు ఇర్లోడు.

మొదట ఎలుకలు తోడిన మట్టిని పక్కకు తీసి, బొక్కలోకి తొంగి చూసి ''సామే, పాము బొక్కలోనే సుట్ట సుట్టుకోనుండాది. నన్ను జూసి భయపడి వణికి సస్తావుండాది'' సంతోషంగా అన్నాడు.

''నిన్ను జూస్తే పామెందుకు భయపడుతుందిరా'' అడిగాడు గంగిరెడ్డి.

''సామీ పాము భయపడేది వొగ గెద్దకు, యిర్లోనికే. మా వాసన తగిల్తే సాలు ఎంత పెద్ద పామయినా పారుకోని పరిగెత్తాల్సిందే.'' అంటూ సలాకీతో బొక్కను కాస్తా తవ్వి మట్టిని పక్కకు తీశాడు. పాము బుసలు కొడుతూ కనిపించింది.

''సి నీయమ్మా గబ్బుదానా... లోపల పెట్టె పెట్కోనుండావు. యింకెక్కడికి పోతావులే. నీ మొగుణ్ణి నేనొచ్చినాగదా'' అన్నాడు ఇర్లోడు.

చిత్తూరునుంచీ వచ్చిన పుంగనూరు బస్సు స్టాండ్లో కొంతసేపాగి జనంలో కిటకిటలాడుతూ పలకరించి వెళ్ళడానికి వచ్చిన అతిథిలా మజీదు దాటుకొని పెద్దగా హార్నిచ్చుకుంటూ చదుం వైపు దూసుకుపోయింది.

ఇర్లోడి ఆలోచనల పరంపర తెగిపోయింది. ఈసారి నాగడు చిందులేస్తుంటే, తనతోబాటు నారిగోడు డమకు వాయిస్తున్నాడు.

వాళ్ళ చేతుల్లో జెల్లలు డముకులపైన లయబద్ధంగా పడుతున్నాయి.

''పుట్టలోకి పాంపాయిరా సిన్నాయనా డుబ్బాచుకో డుబ్బాచుకో

నడుంబట్టి లాగరా సిన్నోడా డుబ్బాచుకో డుబ్బాచుకో

తలాబట్టి లాగరా సిన్నోడా డుబ్బాచుకో డుబ్బాచుకో''

పాడుతూనే అందర్నీ నవ్విస్తూ చిందులు తొక్కుతున్నాడు నాగడు.

''వీడు భలే పలాతనగా వుండాడే. యేమి ఆకర్షన (యాక్షన్) చేస్తావుండాడో'' ఎవరో మెచ్చుకోలుగా అంటున్నారు.

అంతవరకూ అక్కడ చేరిన గుంపు పలుచబడుతోంది.

ఇర్లోడు అదేదీ గమనించడం లేదు. యాంత్రికంగా డమకు వాయిస్తూనే ఆలోచిస్తూ వాళ్ళ వెంట నడుస్తున్నాడు. వాళ్ళు యిచ్చింది పుచ్చుకుని వీధి వీధి తిరుగుతున్నారు. వాళ్ళ ప్రదర్శన బేరి వీధికి వచ్చింది.

అక్కడా అదే చిందు.

వాళ్ళు ఉదయం తాగిన కల్లు మత్తు దిగిపోయి చాలాసేపయింది. అందుకే వాళ్ళ చిందులో ఉత్సాహం తగ్గిపోయింది. వాళ్ళు నీరసంగా చిందు తొక్కుతున్నారు.

నారిగోడి గొంతు మేకగొంతులా కీచుగా వినిపిస్తోంది. ఆ పాటలోని ఇతివృత్తం మళ్ళీ పాముల వేటదగ్గరికే చేర్చింది ఇర్లోన్ని.

'వొరేబ్బా. ఈ పక్క తవ్వితే అది ఆ పక్కకు పోతాది గానీ, ఆ సీతాఫలం చెట్లోకి పోయి రెండు మండలు కొట్టకరా'' అని పురమాయించాడు ఇర్లోడు. ముసిలిగోడు అక్కడికి సమీపంలోనే వున్న సీతాఫలం చెట్లోనుంచీ సందెడు కొమ్మలు నరుక్కువచ్చి వేస్తే, ఆ కొమ్మల్ని గుంటి అడుగుభాగాన చుట్టూ తురికి బొక్కవైపునమాత్రం వదిలేశాడు. ఆ తర్వాత సలాకీతో తవ్వి మట్టిని వెనక్కి తీస్తుంటే పాము బుస్సున శబ్దం చేస్తూ, నాలుకను చాపుతూ చాలా పైకిలేచింది.


అదిచూసి 'భద్రంరా యిర్లోడా' అంటూ హెచ్చరించాడు గంగిరెడ్డి.

''యిట్లా పాముల్ని నా హయాంలో ఎన్ని జూసుంటాను. యిది నన్నేం జేస్తుంది'' నిర్లక్ష్యంగా అన్నాడు యిర్లోడు.

''అది నాగుబాము. భయంగదా''

'' యిర్లోని పుట్టుక పుట్టినాక పాములకు యెర్సుకుంటే యెట్లా?''

''నాగుబాము కరిస్తే.. నిలవనా సావరూ?''



"మాకు పామేరు అనే వొగ తెల్లేరుంటుందన్నా. దాన్ని నోట్లో యేసుకోని వచ్చినామంటే ఎంత మిడిమేళం మిన్నాగు కర్సినా ఏమీగాదు." గొప్పగా చెప్పాడు ఇర్లోడు.

"అయితే దాని పేరు కొంచెం చెప్పబ్బా!"

"దాని పేరు చెబితే అది ఫలించదంటారు,."

"పోనీ అది మీకెట్టా దొరుకుతాదో అదన్నా సెప్పు"

"దానిగురించీ ప్రతి యిర్లోనికీ తెలుసన్నా."

"అంత గొప్ప వేరును మీరెట్టా కనిపెట్టారబ్బా."

"ముందెప్పుడో నాగుబామూ, ముంగిశకు పోట్లాట జరగతానున్నిందంట, కడాకు ముంగిశ పామును తుండెతుండేలుగా కొరికేసి పరిగెత్తుకుంటా పోయి వొగ చెట్టుకు కర్సుకోని వుండిపోయిందంట. కొంతసేపటికి దాని వంట్లోవున్న విషమంతా విరిగిపోయి సక్కగా పోయిందంట. పామును పట్టనుబోయిన యిర్లోడు అది గమనించుకొని దాని ఏరును సంపాదించినాడంట. ఈ ఏరు లేకుండా ఏ యిర్లోడూ ఇల్లు యెలబారడు సామె.

అంతా తెలిసినట్టే చెప్పాడు ఇర్లోడు.

"మొత్తానికి భలే విద్దెబ్బామీది" మెచ్చుకోలుగా అన్నాడు గంగిరెడ్డి.

"యిప్పుడు నేను నమల్తా వుండేదిగూడా ఆ యేరన్నా" అంటూ నోరు చూపించి, తిరిగి మరికొంత తవ్వాడు.

పాము భయంతో ముడుచుకుపోయి కనిపించింది.

" ఎంత పెద్ద పామురా తండ్రీ. కేజీ పురుగులన్నా తినేసుంటుంది" అనుకున్నాడు గంగిరెడ్డి. అది మెల్లగా కదిలి పారిపోవడానికి చూస్తోంది.

"భద్రం నాయనా" హెచ్చరించాడు ముసిలిగోడు.

"చేతికి చిక్కిన పాము. యింకేం చేస్తుంది" అంటూ ఇర్లోడు తమరకట్టెను అందుకొని మెల్లగా తమరవైపున కట్టెతో దాని తలభాగాన్ని గట్టిగా నేలలోకి నొక్కిపట్టి ఎడమచేత్తో దాని తలను పట్టుకుని పైకిలేపాడు. బారెడు పొడవుతో అతని చేతిలోని నాగుబాము నిగనిగలాడుతూ రబ్బరుగొట్టంలా వ్రేలాడసాగింది.

"వొరెబ్బా. చాకుండాదా?" అంటూ అడిగాడు ఇర్లోడు.

ముసిలిగోడు మొల్తాడులో కట్టుకున్న చిన్నచాకుని విప్పి తండ్రిచేతికిచ్చాడు. ఇర్లోడు పాముతోకను తీసి ఒక కాలికిందేసి తొక్కి, కదలకుండా పట్టుకున్నాడు. ఆ తర్వాత చాకు కొసను పాము తలకింద పొట్టలోకి దించి, మెల్లగా కోసుకుంటూ తోకవరకు చర్మాన్ని తెంపాడు. పాము గిలగిలా కొట్టుకుంటుంటే, తన వంట్లో శక్తినంతా చేతిలోకి కూడదీసుకుని పాము కదలకుండా యింకా గట్టిగా పట్టుకున్నాడు.

"యిప్పుడే మెలకువగా వుండాల. పట్టు తప్పిందా భయంతో పాము కరిచేస్తుంది. అట్లా కరిసిందంటే దాని నోట్లో విషమంతా మనవంట్లో కొచ్చేస్తుంది. ఆ మింద ఎన్ని పామేర్లు నమిలి మింగినా ఫలితముండదు." పాము చర్మం తీసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కొడుక్కి చెప్పసాగాడు ఇర్లోడు.

ఇర్లోడు చాకుని కొడుక్కి తిరిగిచ్చేసి తన కుడిచేతి చూపుడివేలిని, పాముతోక వైపున దూర్చి కదిలిస్తూ తలదాకా చర్మాన్ని వలిచేసి, క్షణాల్లో చర్మం ఒక చేత్తో, పాముదట్టెం ఒక చేత్తో పట్టుకున్నాడు. ఆ తర్వాత పాము దట్టాన్ని దూరంగా విసిరేసేశాడు. అదికొంత సేపు గింజుకుని ప్రాణాలొదిలేసింది.

ఇర్లోడు పాము చర్మాన్ని సాపుచేసి, తడిని తుడిచేసి, చుట్టచుట్టి బ్యాగులో పెట్టేశాడు. ఆ పైన గంగిరెడ్డి దగ్గర రావాల్సిన డబ్బులు తీసుకుని బొడ్లో దోపుకుంటూ "నాయనా నువ్వు కొరముట్లు, ఎత్తుకోని యింటికి పా.

నేను కల్లూరికి బొయ్యి ఈ తోలు అమ్మేసొస్తా" అంటూ కల్లూరి వైపుకు దారి తీశాడు.

ముసిలిగోడు కొరముట్లు తీసుకుని యానాది మిట్ట వైపుకు బయలుదేరాడు. పామును చంపించినందుకు ఎక్కడ 'నాగదోషం' పట్టుకుంటుందోనని గంగిరెడ్డి కొన్ని చిదుగులు పేర్చి, అందులో పాము దట్టెం వేసి కాల్చడానికి ఉపక్రమించాడు.

ఇర్లోడు గంటలో కల్లూరికి చేరుకుని, తాను మామూలుగా తోళ్ళు అమ్మే హుసేన్ దగ్గరికి వెళ్ళాడు.

అప్పటికే, అరవయ్యేండ్ల హుసేన్ తన కసాయి అంగడి దగ్గర పొద్దుట్నుంచీ అమ్మగా మిగిలిన కొద్దిపాటి మాంసాన్ని తండుపైన కుప్పగా పెట్టి, ముసురుతున్న ఈగల్ని తోలుకుంటూ కూర్చొనున్నాడు.

"యేమి హుసేనూ. వూరికే కూసోనుండావు?" పలకరించాడు ఇర్లోడు.

" ఏమీ యిర్లన్నా. చానా దినాలకీ కనిపిస్తివి. బాగుండావా?" అడిగాడు హుసేన్

అతని మాటల్లో ఉర్దూ యాస కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"యాడబ్బా ఈ కరువుకు పాములుగూడా కరువైపోయియుండాయి. సరేగానీ మంచి జాతయిన నాగుబాము శరమ్ము దెచ్చినా తీసుకుంటావా?"

"యిప్పుడే సామీ.. మేము అంగడికి కోసే యాటలోళ్ళే అమ్ముకోలేక చస్తావుండాము"

"అదేమబ్బా అట్టాంటివి"? నీరసంగా అన్నాడు ఇర్లోడు.

"బెంగుళూరులో తోళ్ళ ఫ్యాక్టరీవోళ్ళు వచ్చి తోళ్ళు కొనక్కపోతావుండ్రి. యిప్పుడు వాళ్ళూ రావడంలా. తోళ్ళు కొనే నాథుడు లే."

"అయితే యింకెట్టా సామీ"

"నేనేం చెయ్యలేను. " ఖచ్చితంగా చెప్పేశాడు హుసేన్.

"యింకెవురన్నా తీసుకుంటారా?" అని అటూ ఇటూ చూసి రహస్యం చెబుతున్నవాడిలా స్వరం తగ్గించి "అడివి జంతువుల్ని, పాముల్ని సంపగూడదని గవర్నమెంటు రూలుపెట్టిండాది. పాము చర్మాలమ్మగూడదు.

మొన్నామద్దెన సందుం దెగ్గర పాము చర్మాలమ్మే వొగ యిర్లోన్ని స్మగ్లింగ్ కేసుకింద జైల్లో తోసినారంట. జాగర్త." అన్నాడు హుసేన్.

"స్మగ్లింగంటే యేందన్నా." అడిగాడు ఇర్లోడు.

"దొంగవ్యాపారం" మాంసానికి వాలుతున్న ఈగల్ని తోలుతూ చెప్పాడు.

" ఇవి మాకు వుర్తే. దొంగయాపారం యెట్టయితాది."

"పాములు మీవల్ల నశించిపోతుండాయంటగ. అందుకనీ... అట్లా రూలు పెట్టానరు. యిదిగో పోలీసుకు తెలిస్తే కష్టం."

అప్పుడే ఎవరో మాంసం కోసం వస్తే , వాళ్ళకు మాంసం కొట్టివ్వడంలో మునిగిపోయాడు హుసేన్.

ఇక చేసేది లేక యింటిముఖం పట్టాడు ఇర్లోడు.

"యోయవ్. ఏమ్యా యిర్లయినా. ఈ వేసంలో భలే వుండావయ్యా ఎవరో గట్టిగా అరచి చెబుతున్నారు.

మాటతో ఆలోచన్లనుంచీ తేరుకుని అటువైపుకు చూశాడతను.

కసాయి అంగడి ముందర నిలబడి నవ్వుతూ అంటున్నాడు హుసేన్.

అతని ముఖంలో ఏదో ఆత్మీయత.

అదే కడపటి అంగడి. అతనిచ్చింది తీసుకుని చిందు చాలించారు వాళ్ళు,.

అప్పటికే సాయంత్రమైపోయింది.

పగలంతా తన ప్రతాపంతో జనాన్ని చిందులు తొక్కించిన సూర్యుడు పడమటి కొండలవైపు పరుగెడుతున్నాడు.

వాళ్ళు బాగా అలసిపోయారు.

"మామా. ఎగిరీ ఎగిరీ వళ్ళు నొప్పులుగా వుండాయి. తెల్లగుర్రమెక్కుదామా!" అన్నాడు ఉత్సాహంగా వెంకటస్వామి.

"సరే పదండబ్బా" అంటూ ఇర్లోడూ నాలుక చప్పరించాడు.

వాళ్ళు బస్టాప్ దగ్గరున్న కల్లంగడిలోకి మరోసారి దూరి తలా రెండు ముంతలు తాగి మూతులు తుడుచుకుంటూ వెలుపలికొచ్చి యానాదిమిట్టకు బయలుదేరారు.

దేవళం మిట్టదాటుకుని మేకపోతు దిన్నెవైపుకు నడిచి అక్కడే వున్న మేకలోని బండపైన కూర్చున్నారు.

వచ్చిన డబ్బుల్ని, ధాన్యాన్ని సమంగా పంచుకున్నారు.

ఇర్లోని భాగానికి రెండు అర్థశేరు ధాన్యం, పదిరూపాయలు నగదు, ఒక పాత చీర, మరో రెండు పాత గుడ్డలు వచ్చాయి.

పంచుకున్న ధాన్యాన్ని, బట్టల్ని, బ్యాగుల్లో భద్రపరచుకుని వాళ్ళు యానాదిమిట్ట దారి పట్టారు.

ముందు వాళ్ళు, వెనక ఇర్లోడు, అతని వెనక ముసిలిగోడు

"గవర్నమెంటు రూలు పున్నెమాని పాములుబట్టి ఆడించే విద్దెమాతోనే కడ్తెపాయ. అదిపోయినాక.. ఎప్పుడో పూర్వీకులనుంచీ వస్తావుండే.. ఈ చిందయినా జీవనాధారమైతుందనుకుంటే... పొగులంతా తిరిగినా పదిరూపాయలు రాలా,.. ఏం బతుకులో..

దముకుని ఎగేసుకుని ఆలోచిస్తూనే నడుస్తున్నాడు ఇర్లోడు.